క్లుప్తంగా

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న సూపరింటెండెంట్ హరిబాబు

రాజాం సిటీ: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు తన పుట్టిన రోజు సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో గురువారం ఓ మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు అంటూ హంగులు, ఆర్బాటాలకు పోకుండా ఒక మొక్కను నాటాలని కోరారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామ సమీపంలో ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు గురువారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. గంజాయి, కొకైన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలు తరలించినా, అక్రమంగా మద్యంసీసాలు పట్టుకువెళ్లినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహించొద్దన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని పలు మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేసి, బెల్టుషాపులో విక్రయించేందుకు ఓ వ్యక్తి తరలిస్తున్న 16 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ జి.భాస్కరరావు గురువారం రాత్రి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, అలజంగి గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

వితరణ



క్రీడాదుస్తులతో విద్యార్థులు

రేగిడి: మండలంలోని దేవుదళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పాలవలస రమణమూర్తి క్రీడాదుస్తులు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు చేతులమీదుగా మొత్తం 160 మంది విద్యార్థులకు వాటిని గురువారం అందజేశారు. తమ తల్లిదండ్రులైన పాలవలస కృష్ణమూర్తి, ఆదిలక్ష్మిల పేరిట వీటిని అందిచామని దాత తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, సీఎంఆర్‌టీ చంద్రరావు, పీడీ కోటి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



స్టాక్ రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ జైభీమ్

రాజాం: పట్టణంలోని పలు మద్యం దుకాణాల్లో రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ తన సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, మద్యంసీసాలు, వాటి కంపెనీల వివరాలపై ఆరాతీశారు. ఎంఆర్‌పీ(మాక్సిమమ్ రిటైల్ ప్రైస్)కే మద్యం విక్రయాలు చేపట్టాలని వ్యాపారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేర అమ్మకాలు జరగాలని, అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా మద్యం అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెజ్లింగ్ పోటీల్లో కంచరాం విద్యార్థుల సత్తా



కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

రాజాం: మండలంలోని కంచరాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో తమ సత్తా చాటారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలోని యాదమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన అండర్-17 విభాగంలో పాఠశాలలో చదువుతున్న బత్తిన అంజలి, ఎ.సంతోషిణిలు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ వసంతకుమార్, పీడీలు టి.దుర్గారావు, పి.బంగార్రాజులు గురువారం అభినందించారు.

నేటి బాలలే.. రేపటి నవభారత నిర్మాతలు!

భారత ప్రప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం పురస్కరించుకుని, బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది అంతా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నేటి బాలలే రేపటి పౌరులు, నవభారత నిర్మాతలని, వారి బంగారు భవిష్యత్ కోసం మనమంతా కృషి చేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. మనం వేసే ప్రతీ అడుగు పిల్లలకు మార్గదర్శకం కావాలని, మనం చేసే ప్రతీ పని వారిని చక్కని సమాజం వైపు నడిపించాలన్నారు. పలువురు చిన్నారులు వేసిన చాచాజీ వేషధారణలు కనువిందు చేశాయి.

-బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవంలో ఎంపీడీవో రాంబాబు, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, ఎంఈవో త్రినాథరావు తదితరులు



రామభద్రపురం శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న విద్యార్థులు, సిబ్బంది



బాడంగి: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



బొబ్బిలిరూరల్: నారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు



బొబ్బిలి: ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



రేగిడి: వన్నలి పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సిబ్బంది



వంగర: జాతీయ నాయకుల వేషధారణల్లో విద్యార్థులు, వెనక ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తదితరులు



వంగర: మగ్గూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవంలో సిబ్బంది, చిన్నారులు



రాజాం సిటీ: బాలల దినోత్సవంలో అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన



సంతకవిటి: సిరిపురం పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రాజాంలోని ప్రభుత్వ బాలభవన్‌లో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



రాజాం: విజేతలకు బహుమతులు అందిస్తున్న డిప్యూటీ ఈవో మోహనరావు

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలి



ఎం.సీతారాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

వంగర: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని రాజాం ఐసీడీఎస్ పీవో తోట కనకదుర్గ సూచించారు. మండలంలోని ఎం.సీతారాంపురం, కొప్పరవలస, కె.కొత్తవలస తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. రికార్డులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, ప్రీస్కూల్ విధానం, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. సమయానికి కేంద్రాలు తెరవాలని, లబ్ధిదారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందివ్వాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు మంచి పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని తెలిపారు.

గ్రంథాలయాల్లో ప్రపంచ విజ్ఞానం

అన్ని మండలాల్లోని శాఖా గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిల్లోని పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని వక్తలు తెలిపారు. ప్రపంచ విజ్ఞానమంతా గ్రంథాలయాల్లో పుస్తకాల రూపంలో ఉందని, ప్రతిఒక్కరూ జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ యుగంలోనూ ప్రతిఒక్కరూ పుస్తకాలు చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారంటే దానికి కారణం గ్రంథాలయాలేనని వాటి ఆవశ్యకతను వక్తలు వివరించారు.

-బొబ్బిలి, రాజాం



రాజాం శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవం, గ్రంథాలయాల వారోత్సవాలు



బొబ్బిలి: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది



బాడంగి గ్రంథాలయంలో నెహ్రూ గొప్పతనం కొనియాడుతున్న ఎంఈవో లక్ష్మణదొర



తెర్లాంలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో త్రినాధరావు, పక్కనే లైబ్రేరియన్ కృష్ణమూర్తి



సంతకవిటిలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న ఎంపీడీవో సురేష్‌కుమార్, గ్రంథాలయాధికారిణి శ్రీదేవి



రేగిడి: గ్రంథాలయాల ఆవశ్యకతను వివరిస్తున్న తహసీల్దారు చిన్నారావు

అక్షరాస్యతా లక్ష్యాలు చేరుకోవాలి

తెర్లాం/రేగిడి/వంగర/రాజాం/బొబ్బిలి రూరల్: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ప్రధాన లక్ష్యంగా అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం ముగిసింది. వెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో ఇచ్చిన ఈ శిక్షణా తరగతుల్లో సీసీలు, వీవోఏలు, వలంటీర్లకు చదవడం రాని వారికి చదవడం, రాయడం ఏ విధంగా నేర్పించాలో అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ తమ పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళా నిరక్షరాస్యులకు చదువు చెప్పాలని, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతిఒక్కరూ కనీసం 10 మందికి తక్కువ కాకుండా అక్షరాస్యులను తయారు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.



రేగిడి: శిక్షణ పొందిన వలంటీర్లతో వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు



బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్



తెర్లాంలో జరిగిన ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు



రాజాంలో జరిగిన కార్యక్రమంలో సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

మధుమేహం వ్యాధి నివారణకు కృషి చేయాలి



తెర్లాం: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు రెడ్డి శ్రీనివాసరావు, శెట్టి శ్రీనివాసరావు



వంగర: అవగాహన ర్యాలీలో గ్రామీణ వైద్యులు

తెర్లాం: మధుమేహం వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, పెరుమాళి పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ శెట్టి శ్రీనివాసరావు కోరారు. స్థానిక పీహెచ్‌సీలో మధుమేహం వ్యాధి నివారణపై ఆశ కార్యకర్తలకు గురువారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ సమాజంలో మధుమేహం వ్యాధిగ్రస్తులు రోజురోజుకీ ఎక్కువైపోతున్నారని, దీనికి ప్రధానంగా వారి ఆహారపు అలవాట్లు, జీవన విధానమే కారణమన్నారు. మధుమేహం వ్యాధి మరింతగా ప్రబలకుండా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలంతా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాయామం, యోగా చేసి, శారీరక, మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలని, తద్వారా మధుమేహం వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. అనంతరం వ్యాధి నివారణ అంశాలు తెలిపే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గోపాలనాయుడు, రాధమ్మ, పీహెచ్‌సీ ఫార్మసిస్ట్, ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు ఎన్.నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంగర: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చౌదరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చాలామంది మధుమేహంతో బాధపడుతున్నారని, ఈ వ్యాధి నిర్మూలనకు ప్రజల్లో అవగాహన పెంచే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉగిరి ముత్యాలరావు, జి.శ్రీనివాసరావు, భీమనాయుడు, జగ్గునాయుడు,పాల్గొన్నారు.

త్వరితగతిన ధ్రువపత్రాలు జారీ చేయాలి

వంగర: అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు కోసం విద్యార్థులకు అవసరమైన పుట్టిన తేదీ తదితర ధ్రువపత్రాలను త్వరితగతిన జారీ చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. అపార్ నమోదును ఆధార్ కార్డులోని వివరాల ఆధారంగా చేస్తుండడంతో ఆధార్‌లో నెలకొన్న తప్పులతో వాటిని సరిచేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సకాలంలో ధ్రువీకరణ పత్రాలు జారీ కాకపోవడం, చాలా గ్రామాల్లోని రెవెన్యూ సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో బర్త్ సర్టిఫికెట్ జారీకి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. విద్యార్థుల అపార్ నమోదుకు ఎటువంటి ఆటంకం కలగకుండా బర్త్ సర్టిఫికెట్ జారీకి నిబంధనలను సరళతరం చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గర్భాపు నారాయుడు, శనపతి సత్యారావు పాల్గొన్నారు.

ఎంపీడీవో పరిశీలన



ఆధార్ సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. విద్యార్థుల డేటా నమోదులో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆయన సూచించారు. అపార్ నమోదుకు ఆధార్ కార్డులోని వివరాలు తప్పనిసరి కావడంతో ఆధార్‌లోని తప్పులను త్వరితగతిన సవరించాలని తెలిపారు.

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ గురువారం సందర్శించారు. అక్కడి సిబ్బంది సేవలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల అపార్ నమోదుకు ఆధార్ కార్డులోని వివరాలు సరిచేయాల్సి ఉందని, త్వరితగతిన ఆధార్ డేటాను అప్‌డేట్ చేయాలని తెలిపారు.

25 నుంచి 108 సిబ్బంది సమ్మె



బొబ్బిలి: 108 వాహనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



బాడంగి సీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన 108 సిబ్బంది

బొబ్బిలి రూరల్/రామభద్రపురం/తెర్లాం/బాడంగి/బొబ్బిలి: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా 108 అంబులెన్స్ సిబ్బంది ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు వారు మండల కేంద్రాల్లోని ఎంపీడీవోలు, తహసీల్దార్లకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. 108 అంబులెన్స్‌ల నిర్వహణకు ప్రభుత్వం నిధులు ఇవ్వనందున తమకు జీతాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, జీవో నంబరు 49ను పునరుద్ధరించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

వసతిగృహం సందర్శన



విద్యార్థినుల కోసం సిద్ధం చేసిన భోజనం వంటకాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

బొబ్బిలి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై బాలికలను ఆరాతీశారు. అలాగే విద్యార్థుల కోసం సిద్ధం చేసిన రాత్రి భోజనం వంటకాలను పరిశీలించి, నాణ్యమైన ఆహారం అందివ్వాలని, ఆహార పదార్థాలు రుచి, శుచి కలిగి ఉండాలని సిబ్బంది సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

వంగర: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు జీపీడీపీ(గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు) తయారీపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపయోగించి, ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఆ తర్వాత వాటికి అనుగుణంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోపింటి త్రినాథ్, ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావు, ఏపీఎం తెర్లి మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.